క్లుప్తంగా

నేతపాలెంలో కమిషనర్ పర్యటన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పొదిలి: స్థానిక నేతపాలెంలో మురుగు సమస్యపై 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన కథనంపై నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి స్పందించారు. నేతపాలెంలో రోడ్డుపై చేరిన మురుగు నీటిని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. సమస్య ప్రస్తుతానికి తాత్కాలికంగా పరిష్కారం చేయిస్తానని, భవిష్యత్‌లో శాశ్వతంగా సమస్య లేకుండా పనులు చేయించేలా చూస్తానని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. సమస్య తాత్కాలికంగా పరిష్కారమయ్యేలా పనులు చేపట్టారు. దీంతో కమిషనర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు బండి అశోక్‌తో పాటు స్థానికులు అభినందించారు.

మార్కాపురాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎంపీ మాగుంట



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

మార్కాపురం: మార్కాపురాన్ని జిల్లా చేయడంతోపాటు వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త వెన్నా పోలిరెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు త్వరలో అమలు కానున్నాయని చెప్పారు. మార్కాపురం ప్రాంత అభివృద్ధిలో తానూ భాగస్వామినవుతానన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కందుల సోదరుడు రామిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ డీవీ కృష్ణారెడ్డి, పోలిరెడ్డి, పరమేశ్వరరెడ్డి, వెన్నా నాగార్జునరెడ్డి, కందుల విఘ్నేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాగు కాలంలో రైతన్నలు జాగ్రత్తగా ఉండాలి

- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో అప్రమత్తతతో మేలు
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనమే మేలు



కె.బుజ్జిబాయి, వ్యవసాయాధికారి

పెద్దారవీడు: వర్షకాలం పంట సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. పొలాలను వర్షాకాలం సీజన్‌కు సిద్ధం చేసుకున్న రైతులు బోర్ల కింద పత్తి విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పత్తి, మిరప విత్తనాలు సైతం కొనుగోలు చేసుకున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. కలుపు నివారణ సమస్య ఉండదని జిల్లాలో చాలా మంది రైతులు నిషేధిత విత్తనాల వైపు చూస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార అర్బాటాలతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాయి. పలు కంపెనీల యాజమాన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ ప్రయాణాలు ఆశ చూపడంతో డీలర్లు సదరు కంపెనీల విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. వర్షాకాలం సీజన్ వచ్చిందంటే చాలు నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతాయి. ప్రకటనలు, ప్రచార అర్బాటాలు లోబడి విత్తనాలు కొనుగోలు చేయకూడదు. అకర్షణీయమైన ప్యాకింగ్, గుర్తింపు లేని లేబుళ్లతో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలను అంటగడుతున్నాయి. ఇటువంటి కంపెనీల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో పత్తి, మిరప, వరి, కంది పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుంది. విత్తనాల ప్యాకెట్లపై ప్రభుత్వ నిబంధనలు, వివరాలు సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తనాలు, పురుగుల మందు ఎంపిక, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి వివరించారు.



విత్తనాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

విత్తనాలు ఎంపికలో పాటించాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు రశీదులపై నంబర్, విత్తనం రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయరాదు.
- రశీదుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయదారుని గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారి లేక శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందుల ఎంపికలో...

- పంటలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై చక్రకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చి పెట్టాలి.
- ఒక పంటకు వాడిన పురుగుల మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడాలి.

ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు

- లైసెన్స్ దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డుల్లో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారి సహకారంతో పరీక్షలకు పంపాలి.
- చిల్లులు పడి, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

కల్తీ మందులు ఇలా గుర్తించాలి

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి.
- ఎరువులు ఇసుక రేణువుల రూపంలో, పోటాష్, సూపర్ పాస్ఫేట్ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీలీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా, క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- యూరియా వంటి ఎరువును ఒక చెంచాను 5 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశం ఉంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



లారీ కింద ఇరుక్కుపోయిన ద్విచక్ర వాహనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బెల్లం కొండవారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తూర్పు గంగవరం గ్రామానికి చెందిన షేక్ యాసిన్ చిలకూరిపేటకు చెందిన తన స్నేహితుడు షేక్ సుభానీతో కలిసి సోమవారం ద్విచక్ర వాహనంపై దర్శికి బయల్దేరారు. మార్గంమధ్యలో దర్శి – చీమకుర్తి ప్రధాన రహదారిలో బెల్లం కొండవారిపాలెం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ వాహనంలో వారిని వైద్యశాలకు తరలించారు. మరో ద్విచక్ర వాహనం కూడా ఢీకొన్నా ఎటువంటి గాయాలు కాకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

దాతల సహకారంతో కాలువ పనులు



కాలువ పనులు చేస్తున్న జేసీబీ

పుల్లలచెరువు: గ్రామంలోని కాటి వీరన్న చెరువుకు నీరు వచ్చే కాలువ పూడిపోయింది. దీంతో చెర్వులోకి వర్షం నీరు రావడం ఆగిపోయింది. ఈ చెరువు ఒక్కసారిగా నిండితే మూడేళ్ల పాటు గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండదు. వర్షాలు పడుతున్నా చెరువులోకి నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను గురించి స్థానికుడై హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న విద్యాదాత పోట్లపల్లి బాలకృష్ణ దృష్టికి గ్రామ పెద్దలైన కె.రఘు, కె. కుమార్, పి.ప్రసాద్, జి.భాస్కర్, డిష్‌చిన్నా తదితరులు తీసుకెళ్లారు. స్పందించిన బాలకృష్ణ తనకు తెలిసిన హైదరాబాద్‌లోని ఇంజినీర్లను పిలిచి కాలువను చెక్ చేసుకుని చెరువులోకి నీరు వచ్చే విధంగా ఎలా పనులు చేయాలో ప్రణాళికలు వేసి వెళ్లారు. బాలకృష్ణ ఆధ్వర్యంలో సమారు రూ.2 లక్షల ఖర్చుతో కాలువ పనులు సోమవారం చేపట్టారు. ఈ పనులు పూర్తి అయితే కాలువ ద్వారా కాటి వీరన్న చెర్వుకు సంమృద్ధిగా నీరు చేరుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆంజనేయా పాహిమాం



అలంకరణలో అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

– వేడుకగా పదహారు రోజుల ఉత్సవం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పదహారు రోజుల పండగ నిర్వహించారు. అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల జయజయధ్వానాల నడుమ ఏకాంత సేవ, పనాపు ఉత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. భజనల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గిద్దలూరు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



కొమరోలు: ఈద్‌గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



తర్లుపాడులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

మార్కాపురం టౌన్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఫజల్ నమాజ్ అనంతరం నూతన దుస్తులు ధరించి గృహాల్లో నమాజ్ చేశారు. మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డు, నాగులవరం రోడ్డు, తర్లుపాడు రోడ్డులోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్తల త్యాగ నిరతిని ప్రతి ఒక్క ముస్లిం ఆదర్శంగా తీసుకోవాలని మత పెద్దలు సూచించారు. ఇస్లాం మత సూత్రాలను జీవితంలో కచ్చితంగా పాటించిన వారే మనుగడ సాగిస్తారన్నారు. ఇస్లాం పరమత సహనం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ జాలి, దయ, దాతృత్వం, సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. మంచి చేయకున్నా, చెడు మాత్రం తలపెట్టవద్దన్నారు. సమాజంలో మానవులు సహాయ గుణాన్ని మరచిపోతున్నారని, మానవత్వ విలువలు రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, అధికారులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

- కొనకనమిట్ల: బక్రీద్ సందర్భంగా కొనకనమిట్ల, గొట్లగటు, సిద్ధవరం, చినారికట్ల గ్రామాల్లో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.
- తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడుతోపాటు తుమ్మలచెరువు, మీర్జపేట, పోతలపాడు, గానుగపెంట తదితర గ్రామాల్లోని ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీమ్ త్యాగం ఆదర్శనీయమని మత గురువులు వివరించారు. ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడిచి పేదలకు దాన ధర్మాలు చేయాలని, పేదరికంలేని సమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, మీర్జపేట సర్పంచ్ మీరయ్య, తుమ్మలచెరువు సర్పంచ్ షాజహాన్ రసూల్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.
- పొదిలి: బక్రీద్ పర్వదినం సందర్భంగా స్థానిక ఈద్గా మైదానంలో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఈద్గా మైదానాన్ని కమిషనర్ చంద్రశేఖరరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో శుభ్రం చేయించారు. ఎస్సై కోటయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



మార్కాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పొదిలిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



బేస్తవారిపేట: ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు ఈద్గా వద్ద, కొంగలవీడు రోడ్డులో ఈద్గా వద్ద, అంబవరం, కేఎస్‌పల్లె, కంచిపల్లె, కొమ్మునూరు, ఉయ్యాలవాడ, ముండ్లపాడు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ పండుగ విశిష్టత గురించి పవిత్ర ఖురాన్ గ్రంథంలోని అంశాల గురించి వివరించారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, రాచర్ల, పాలకవీడు, గుడిమెట్ట, యడవల్లి, ఆకవీడు, అరవీటికోట, అచ్చంపేట, సంగపేట, గౌతవరం, జేపీ చేరువు గ్రామాల్లో ముస్లింలు ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముందుగా మసీదుల నుంచి తజ్‌బీ చేసుకుంటూ ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అనుమలవీడు జామీయా మసీదు ఇమామ్ సయ్యద్ అహమ్మద్ బాషా మాట్లాడుతూ ప్రతి ముస్లిం కచ్చితంగా హజ్‌యాత్ర చేసుకోవాలని వివరించారు. హజ్‌యాత్ర చేస్తే ముస్లిం మీద ఫరజ్ ఉందన్నారు. అనంతరం ఖురాన్‌లోని వాఖ్యలు చదువుతూ వాటి విషయాలను వివరించారు. అంతేకాకుండా రాచర్లలోని మదరసలో చదువుతున్న పెద పిల్లలకు అర్థిక సాయం చేశారు.

కంభం: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి తమ ఇళ్ల వద్ద నుంచి ర్యాలీగా ఈద్గా మైదానం వరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గా మైదానానికి వెళ్లని వారి కోసం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదానం వద్ద ముస్లిం యువకులు ప్రార్థనలకు వచ్చిన వారి కోసం మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేశారు. ఈద్గా మైదానం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొమరోలు: మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భారీగా ముస్లింలు ఈద్‌గాల వద్దకు తరలి వెళ్లి నమాజ్ చేశారు. మతపెద్ద షఫీవుల్లా ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు ఇళ్ల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

బేస్తవారిపేట: మండలంలో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతలపాలెం, బేస్తవారిపేట, కొత్తపేట, గలిజేరుగుళ్ల, వంగపాడు గ్రామాల్లో ఈద్గా మైదానాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అర్ధవీడులో ..

అర్ధవీడు మండలంలో బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రమైన అర్ధవీడులోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాపినేనిపల్లి, మోహిద్దీన్‌పురం, కందుకూరు, నాగులవరం, యాచవరం, మాగుటూరు, కాకర్ల గ్రామాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కంభం: ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఆరీఫ్ హజత్



రాచర్ల: అనుమలవీడులో ఖురాన్ బోధిస్తున్న సయ్యద్ అహ్మద్ బాషా

వైఎస్సార్ సీపీ నేత మృతికి బూచేపల్లి నివాళి



నివాళులర్పిస్తున్న బూచేపల్లి

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి తండ్రి, మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి మృతికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బొట్లపాలెంలో వారి నివాసంలో ఆయన తండ్రి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని బూచేపల్లి హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీనివాస కళ్యాణం



అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు



కళ్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు అనిల్ దంపతులు

పొదిలి: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణాచార్యులు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ ఉభయదాతలు వరికుంట్ల అనిల్‌కుమార్, లక్ష్మీ సురేఖ దంపతుల చేతుల మీదుగా విశేష అభిషేకాలు, కళ్యాణోత్సవం సాగాయి. అనంతరం భక్తులకు స్వామి వారి కళ్యాణ అక్షతలు, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, వెలిశెట్టి నారాయణ, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కరరావు, మేడా నరసింహారావు, సామి రాజా, మాజీ ఎంపీపీ వెలిశెట్టి విజయగౌరి, బొగ్గవరపు లక్ష్మి, కుమారి, రామాపురం కోటేశ్వరరావు పాల్గొన్నారు.